క్లుప్తంగా

న్యాయవాద వృత్తికి వన్నె తెచ్చిన హన్మంతరావు



నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాలజోన్: న్యాయవాద వృత్తికి మాకు నూరి హన్మంతరావు వన్నె తెచ్చారని వక్తలు కొనియాడారు. సీనియర్ న్యాయవాది హన్మంతరావు రెండు రోజుల క్రితం చనిపోగా, సోమవారం ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జూనియర్లకు సలహాలు, సూచనలు ఇచ్చేవారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు బీమా చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎన్జీవో రాకేశ్

ఇబ్రహీంపట్నం: ఉపాధి కూలీలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమాను చేసుకోవాలని రిజర్వ్‌బ్యాంక్ ఎన్జీవో రాకేశ్ అన్నారు. సోమవారం మండలంలోని యామాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పనుల వద్ద కూలీలతో సమావేశం నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ పథకాలైన రూ.20 ప్రధానమంత్రి ఆవాస్‌యోజన బీమా చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షలు వస్తాయని, రూ. 400 చెల్లిస్తే రూ. 4 లక్షలు వస్తాయని , రూ. 360 చెల్లిస్తే కుటుంబంలో ఎవరైనా ప్రమాదశాత్తు రూ.5 లక్షలు వస్తాయని తెలిపారు. కూలీలు లేబర్‌కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి దివాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన ఎదులాపురం రాములు గంగు దంపతులు ఇటీవల వేర్వేరు ఘటనల్లో మరణించారు. వారి కూతురు జగిత్యాలలోని కాలేజీలో పీజీ చదువుతోంది. కొడుకు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వారి దీన పరిస్థితిని తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు వారికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. దాతలు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గర్వందుల శ్రీనివాస్, దయాల రమేశ్, జలందర్, పాకల్లమధు, ఫ్రెండ్స్ సొసైటీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని అభ్యాస పాఠశాలకు చెందిన విద్యార్థులు ఐఐటీ ఒలంపియాడ్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చారు. మొత్తం 14 మంది విద్యార్థులు 1,2,3 స్థానాల్లో నిలిచారు. కాగా హైదరాబాద్‌లో సోమవారం ఇస్రో శాటిలైట్ శాస్త్రవేత్త హరినాథ్ శర్మ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ట్రస్మా రాష్ట్ర నాయకుడు శేఖర్‌రావు అభ్యాస స్కూల్ చైర్మన్ హన్మండ్లు అభినందించారు.

పెద్దపల్లి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా రాంబాబు

జగిత్యాల: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారిగా రాంబాబు నియమితులయ్యారు. జగిత్యాల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న రాంబాబు జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఉండటంతో అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా నియమితులయ్యారు.

సైన్స్‌ల్యాబ్ ప్రారంభం

జగిత్యాల: విద్యార్థులు సైన్స్‌లో నైపుణ్యం సాధించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మానస స్కూల్‌లో సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ప్రయోగాలు చేసినప్పుడే పరిపూర్ణ జ్ఞానం పొందుతారని, ఇంత సైన్స్‌ల్యాబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

వెల్లుల్ల వద్ద కాకతీయ కాలువపై గేట్లు వేయాలి

ఇబ్రహీంపట్నం: మెట్‌పల్లి మండలం వెల్లుల్ల వద్ద కాకతీయ కాలువపై గేట్లు మూసివేస్తే నీళ్లు నిలువ ఉండి ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని రైతులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఉప్లూర్ వద్ద రైతులు గేట్లు మూసివేసి కింది ఆయకట్టుకు లీకేజీ నీళ్లు కూడా రానివ్వడం లేదని తెలిపారు. ఎస్సారెస్పీ అధికారులు వెల్లుల్ల వద్ద గేట్లు వేస్తే నీటి నిలువ ఉంటే రైతులకు మేలు జరుగుతుందని అధికారులు వెంటనే గేట్లు మూసివేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

సిబ్బంది లేరు.. అనుమతి రాదు..

- టౌన్ ప్లానింగ్‌లో సిబ్బంది కొరత
- ఐదుగురికి ఒక్కరే విధులు
- అది కూడా డిప్యూటేషన్‌పైనే..
- నిర్మాణాలపై కొరవడిన పర్యవేక్షణ



మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

మెట్‌పల్లి: మున్సిపల్‌లో టౌన్ ప్లానింగ్ విభాగం ప్రధానమైనది. ఈ విభాగం నుంచే అత్యధిక ఆదాయం సమకూరుతుంది. అలాంటి విభాగంలో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. కొంతకాలంగా అధికారుల కొరతతో ఆ విభాగం అస్తవ్యస్తంగా తయారైంది. ఇక్కడ ఉన్న అధికారులు రాజకీయ ఒత్తిళ్లు, వ్యక్తిగత కారణాలతో ఇతర మున్సిపాలిటీలకు బదిలీ చేసుకుని వెళ్లిపోయారు. తిరిగి వారి స్థానంలో రావడానికి ఎవ్వరూ ఆసక్తి చూపకపోవడంతో డిప్యూటేషన్‌పై నియమిస్తున్నారు. ఐదుగురు సిబ్బంది ఉండాల్సిన చోట ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది కొరతతో పర్యవేక్షణ లేక పట్టణంలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోయి మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

అన్ని పోస్టులు ఖాళీ...

- నిబంధనల ప్రకారం మెట్‌పల్లి మున్సిపాలిటీలో ఒక టౌన్ ప్లానింగ్ అధికారి, ఇద్దరు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఇద్దరు టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్‌లు ఉండాలి.
- 2005లో పంచాయతీగా ఉన్న మెట్‌పల్లిని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఎన్నడూ కూడా పూర్తి స్థాయిలో అధికారులు లేకపోవడం గమనార్హం.
- కొంతకాలం క్రితం వరకు ఒక టీపీవో, ఒక టీపీఎస్ మాత్రమే విధులు నిర్వహించారు.
- ఇక్కడ నెలకొన్న రాజకీయ ఒత్తిళ్ల వల్ల వారు బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి వారి స్థానంలో ఇక్కడకు బదిలీపై రావడానికి ఎవరు కూడా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇతర మున్సిపాలిటీలకు చెందిన వారిని డిప్యూటేషన్‌పై నియమిస్తూ వస్తున్నారు.
- ప్రస్తుతం నిజామాబాద్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న టీపీవో మాత్రమే ఇక్కడ వారంలో మూడు రోజులపాటు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు.

అక్రమాలపై చర్యలు లేవు..

- టౌన్ ప్లానింగ్‌లో అధికారుల కొరతతో పూర్తిగా పర్యవేక్షణ కొరవడింది. దీనివల్ల లేఔట్ లేకుండానే ప్లాట్ల క్రయ విక్రయాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.
- అలాగే అక్రమాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు.
- మరోవైపు అక్రమ నిర్మాణాల వల్ల మున్సిపల్‌కు రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది.

ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకవర్గం చొరవ తీసుకొని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఖాళీలు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం

టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయాం. డిప్యూటేషన్‌పై కాకుండా రెగ్యులర్ అధికారులను నియమించాలని అధికారులకు విజ్ఞప్తి చేశాం. తొందరలోనే నియామకాలు జరుగుతాయని భావిస్తున్నాం.

–మోహన్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి

కొల్వాయిలో నవగ్రహాల ప్రతిష్ఠాపన



నవగ్రహాల ప్రతిష్ఠాపనలో గ్రామస్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయిలో గ్రామంలోని గల్ఫ్ కార్మికులు నిర్మించిన నవగ్రహ దేవతల ఆలయంలో సోమవారం గ్రామస్తులు నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని 97 మంది గల్ఫ్ దేశాల్లో జీవనోపాధికోసం వెళ్లి వారు ఆలయ నిర్మాణానికి విరాళం అందించారు. ఆలయ నిర్మాణం పూర్తికావడంతో వారే ప్రతిష్ఠాపనోత్సవాలకు సైతం పూర్తి ఖర్చు భరించి, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని అభినందించారు.

సారంగాపూర్‌లో మల్లన్న దేవుడి ప్రతిష్ఠాపన

సారంగాపూర్ మండల కేంద్రంలో గ్రామానికి చెందిన జాల పుట్టయ్య, ఆయన తమ్ముడు జాల మల్లయ్య ఇద్దరు అన్నదమ్ములు వారి కుటుంబ సభ్యులు కలిసి రూ. 7.50 లక్షలతో నిర్మించిన మల్లన్న దేవుడి ఆలయం, ఎల్లమ్మ అమ్మవారి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా పట్నాలు వేసి, భక్తులకు అన్నదానం చేశారు.

తాట్లవాయిలో శ్రీరామ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం

రాయికల్: మండలంలోని తాట్లవాయిలో సీతారామ చంద్రస్వామి వరదాత్రి ఆలయంలో సోమవారం హవనం శ్రీరామ యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ హోమం వంటి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు,నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీజేవైఎం, బీఆర్‌ఎస్ నాయకుల చేరిక



విప్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామానికి చెందిన బీజేవైఎం, బీఆర్ఎస్ నాయకులు సోమవారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు తోకల వినోద్, మాజీ ఉప సర్పంచ్ బద్దం మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు పానుగంటి రాజు, దేశవేని ధర్మేందర్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, కల్లెడ గంగాధర్, ఉరుమల్ల కృష్ణచారి, ఆకుల సంతోష్, మ్యాదరవేని రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

రాయికల్: మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల రామస్వామిగౌడ్, ఉప్పుమడుగు ప్యాక్స్ వైస్ చైర్మన్ దుంపల స్వామిరెడ్డి, డైరెక్టర్ సుందరగిరి మురళి, చెదల శంకర్, నీలి రాజమల్లయ్య,ముక్కెర నరేశ్, నీలి నర్సయ్య, సోమ రాజు,జవ్వాజి అక్షయ్ సోమవారం జకిలేటి రాజు రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండపల్లి రవీందర్ రావు,సోమ వెంకటేశ్,సుందరగిరి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ధర్మారం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏవో



ధర్మపురిలో ప్రారంభిస్తున్న డీసీఎమ్మెస్ మేనేజర్

ధర్మపురి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీసీఎమ్మెస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

కోరుట్ల రూరల్: ధాన్యాన్ని శుభ్ర పరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి అన్నారు. మండలంలోని ధర్మారంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి శివ, రైతులు పాల్గొన్నారు.

మండలంలోని మాదాపూర్, పైడిమడుగు, మోహన్‌రావుపేట, వెంకటాపూర్, ఐలాపూర్, గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపి ఏపీఎం శంకర్, సీసీలు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మల్లాపూర్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఐకేపీ ఏపీఎం దేవరాజ్ అన్నారు. మండలంలోని సాతారం, గుండంపల్లి, చిట్టాపూర్, ముత్యంపేట, రాఘవపేట, సిరిపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, మొగిలిపేట, ఒబులాపూర్, వాల్గొండ, గొర్రెపల్లి, వేంపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీసీలు, మహిళలు, రైతులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు లక్ష్మీరాజం, రాజు, రమేష్, స్రవంతి, వీవోఏ, రైతులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని సహకారశాఖ మానిటరింగ్ అధికారి శివనాగేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని అయితిపల్లి, గొల్లపల్లె, మ్యాకవెంకయ్యపల్లి, శాలపల్లి, దోమలకుంట, మద్దులపల్లి, సుద్దపల్లి, లింగాపూర్, ఆరవెల్లి, వెంగళాయిపేట, కొండాయపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. సీఈవోలు రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి, పెగ్గెర్ల, భూషణరావుపేట, చింతకుంట, దూలూర్, తాండ్ర్యాల, అంబారిపేట, పోతారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వనజ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఏపీఎం నరహరి, సీసీలు, రైతులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లి, మెట్లచిట్టాపూర్, జగ్గాసాగర్, ఏఎస్ఆర్ తండా, ఆత్మనగర్,ఆత్మకూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో డీటీసీఎస్ ఉమాపతి,డీపీఎం వనజ,ఏపీఎం విమోచన,తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మల్యాల: రైతులు ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం రాజయ్య అన్నారు. మండలంలోని ముత్యంపేట, తాటిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఐకేపీ ఏపీఎం రాజయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు అంజలితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యామాపూర్, వేములకుర్తి గ్రామాల్లో సోమవారం కొనుగోలు కేంద్రాలను రైతులు ప్రారంభించారు.

బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, సెర్ప్ (ఐకేపీ), డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘ అధికారులు ఖలీం, సీఈవో ఇస్మాయిల్, సెర్ప్ ఏపీఎం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండల వ్యాప్తంగా దమ్మన్నపేట, కాచారం, కట్లకుంట, మేడిపల్లి, పోరుమల్ల, దేశాయిపేట, గోవిందారం, కమ్మరిపేట, లింగంపేట, మన్నేగూడెం, మోత్కురావుపేట, ఒడ్యాడ్, వెంకట్రావుపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

రాళ్లవాగు ప్రాజెక్టుపై బీఆర్‌ఎస్ నిర్లక్ష్యం

కథలాపూర్: మండలంలోని రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువల పై బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసి ఈ ప్రాంత రైతులను మోసం చేసిందని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని భూషణరావుపేటలో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు గండిపడితే మరమ్మతుల గురించి పట్టించుకోలేదన్నారు. కుడికాలువ పక్కనే ఉన్న వరి పొలాలు ఎండిపోతే జెడ్పీ చైర్‌పర్సన్ వసంత పరిశీలించి వరదకాలువలో నీళ్లు లేకనే భూషణరావుపేటలో పొలాలు ఎండిపోయాయని చెప్పడం అర్థరహితమన్నారు. ఈ ప్రాంత సమస్యలపై అవగాహన లేక కాంగ్రెస్ ప్రభుత్వంపై జెడ్పీ చైర్‌పర్సన్ వసంత అనవసరంగా విమర్శలు చేయడం తగదన్నారు. రాళ్లవాగు ప్రాజెక్టు కాలువల గురించి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు గడ్డం స్వామిరెడ్డి, వాకిటి రాజారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, కూన శ్రీనివాస్, కూన అశోక్, పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కోరుట్ల: కోరుట్ల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం స్థానిక కోర్టు హాల్‌లో న్యాయమూర్తి పావని సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా తన్నీరు శ్రీనివాస రావు, ఉపాధ్యక్షుడిగా తోట ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సుతారి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా మద్దుల రోజ, జూనియర్, సీనియర్ మెంబర్లు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మచ్చ రమణా మూర్తి, చెన్న విశ్వనాథం, శ్రీనివాస్, విజయ్ సాయి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు అవిశ్వాస తీర్మానంపై సమావేశం

మల్యాల: మండల పరిషత్ చైర్‌పర్సన్‌పై ఎంపీటీసీ సభ్యులు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం ఉదయం 11 గంటలకు ఆర్డీవో ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సర్దార్ సత్రంలో అక్రమ నిర్మాణాలు ఆపాలి



ఫిర్యాదు కాపీతో వెన్న సురేశ్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సర్దార్ సత్రంపై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని, వెంటనే నిర్మాణ పనులు ఆపాలని జిల్లా సీపీఐ కార్యదర్శి వెన్న సురేశ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టులో సర్దార్ సత్రంపై కేసు నడుస్తున్నప్పటికీ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే నిర్మాణాలు ఆపాలని కోరారు. హైకోర్టులో కేసు ఉండగా, సర్దార్ సత్రం స్థలంలో బ్యాంకు నిర్వహిస్తున్నారని, దానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫీజు చెల్లించలేదని..

- విద్యార్థులను బయటకు పంపిన యాజమాన్యం
- కలెక్టరేట్‌లో బాధిత తండ్రి ఫిర్యాదు

జగిత్యాల: మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్ యజమాన్యం ఫీజు కట్టలేదని విద్యార్థులను బయటకు పంపించిందని సోమవారం సోమవారం వారి తల్లితండ్రులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే... మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామానికి చెందిన విద్యార్థులు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నారు. సోమవారం మూడో టర్మ్ ఫీజు కట్టలేదని బయటకు గెంటేయడంతో నేరుగా వారు జిల్లా కలెక్టరేట్‌కు వచ్చి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫీజు సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ కావాలని వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై డీఈవోను వివరణ కోరగా, సంబంధిత పాఠశాలపై చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

సంక్షిప్త వార్తలు

వాల్మీకి ఆవాసం విద్యార్థుల సంగీత ప్రదర్శన

జగిత్యాలటౌన్: వాల్మీకి ఆవాసం సేవాభారతి విద్యార్థులు సంగీత ప్రదర్శన నిర్వహించారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసం పాఠశాలలో జరిగిన ఘోష్ సంగీత ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది.వాల్మీకి ఆవాసం విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్వాంసులు విద్యార్థులకు పలు సంగీత రీతులపై అవగాహన కల్పించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సంచాలకులు భీమనాతిని శంకర్, జిడిగె పురుషోత్తం, సంగీత విద్వాంసులు ఎలిగేటి రాజేంద్రప్రసాద్, రాంప్రసాద్‌శర్మ, గుండి జగదీశ్వర్, ఆవాస ప్రముఖ్ మల్లేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌ను నియమించాలి

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగులో చౌకధరల దుకాణానికి డీలర్‌ను నియమించాలని సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్‌కు సోమవారం గ్రామ యువకులు వినతిపత్రం సమర్పించారు. గతంలో డీలర్‌గా ఉన్న వ్యక్తి అవినీతికి పాల్పడటంతో ఆయనను తొలగించి మరో దుకాణ డీలర్‌ను ఇన్‌చార్జిగా నియమించారని పేర్కొన్నారు. వెంటనే కొత్త డీలర్‌ను నియమించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ప్రదీప్, ధర్మయ్య, నితిన్, ప్రమోద్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

అంజన్న స్వామికి సన్మానం

రాయికల్: మండలంలోని రామరావుపల్లెకు చెందిన మాసం మారుతి అయోధ్యకు సైకిల్‌యాత్రకు వెళ్లి రాముని దర్శనం చేసుకుని తిరిగి రాగా, సోమవారం ఇటిక్యాలకు చెందిన గురుస్వామి సామల్ల వేణు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఇంటిపన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: పట్టణంలోని ఏప్రిల్ 1నుంచి 30 వ తేదీలోపు ఇంటి పన్ను కట్టిన వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. పన్ను రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన వాసం అక్షర, ఇటిక్యాల ఒడ్డెర కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన దుండ సాహితి అనే విద్యార్థులు 6వ తరగతి నవోదయ పరీక్షలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా వీరిని ఎంపీటీసీ కొమ్ముల రాధ, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రావు అభినందించారు.

నేడు రైతువేదికలో పంటలపై అవగాహన

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతునేస్తం లో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వివిధ పంటలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని ఏవో దీపిక సోమవారం తెలిపారు.

చెక్‌పోస్ట్ వద్ద రూ.73 వేలు పట్టివేత

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండిహనుమాన్ ఆలయ సమీపంలోని అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్ వద్ద ఇబ్రహీంపట్నం పోలీసులు నగదు పట్టుకున్నారు. సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో ఓ వ్యక్తి రూ.73 వేలు తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశామని ఎస్సై అనిల్ తెలిపారు.

మద్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన ముస్కు సరోజ తన ఇంట్లో అక్రమంగా నిలువ చేసిన 9 లీటర్ల బీర్లను పట్టణ ఎస్సై నరేశ్ పట్టుకుని మద్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సరోజపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లేగ దూడకు బారసాల



సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో లేగదూడకు సోమవారం ఓ రైతు కుటుంబం బారసాల చేసి, నామకరణం చేశారు. బీర్‌పూర్‌కు చెందిన భైరవేని సత్యనారాయణ–భాగ్యలక్ష్మి దంపతులు తమకు ఉన్న వ్యవసాయంతో పాటు, ఆవులను పెంచుకుంటున్నారు. ఆవు 21 రోజుల క్రితం ఓ లేగదూడకు జన్మనిచ్చింది. సోమవారం ఇంటిలో బారసాల చేసి, చుట్టు పక్కల వారిని,ఆత్మీయులను పిలిచి మహాలక్ష్మీ రేణుక అని నామకరణం చేశారు. కార్యక్రమానికి వచ్చిన వారికి స్వీట్లు, పళ్లు పంపిణీ చేశారు.

మల్యాలలో కేంద్ర బలగాల కవాతు



జెండా ఊపి కవాతు ప్రారంభిస్తున్న పోలీసులు

మల్యాల: మండల కేంద్రంలో సోమవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. జిల్లా పోలీసులు, కేంద్ర బలగాల కవాతును అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ స్థానిక బ్లాక్ చౌరస్తా వద్ద జెండా ఊపి ప్రారంభించారు. లోకసభ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహిస్తామనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించేందుకు కవాతు నిర్వహించామని తెలిపారు. పోలీసులకు వాగ్దేవి విద్యార్థులు ఘన స్వాగతం పలికి, సన్మానించారు. కార్యక్రమంలో మల్యాల సీఐ నీలం రవి, ఆర్‌ఐ వేణు, ఎస్సై అబ్దుల్ రహీం, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ప్రజాదీవెనలే కొండంత బలం

ధర్మపురి: ప్రజల దీవెనలే తనకు కొండంత బలమని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం విప్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలోప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ .. నియోజకవర్గ కష్ట సుఖాల్లో పాలు పంచుకుని వారి శ్రేయస్సు కోసం అహర్నిషలు కృషి చేస్తానని, కార్యకర్తలే తన బలం బలగమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్ర స్వామి కల్యాణం



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం హోమం,ధ్వజారోహణం, గరుడలగ్నం, బలిహరణం, కల్యాణం, పూర్ణహుతి నిర్వహించారు. కల్యాణానికి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ,గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.